అన్నవరం-వర్తనాపల్లి రహదారి నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయండి : సర్పంచ్ లక్ష్మయ్య

విశాలాంధ్ర-చింతపల్లి : ప్రభుత్వాలు మారుతున్నా తమ ప్రాంతంలో రహదారి పనులు మాత్రం ఏళ్ల తరబడి పూర్తి కాకుండా ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు, పాదాచారులకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నాయని తమ్మంగుల పంచాయతీ సర్పంచ్ సలిమితి లక్ష్మయ్య అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో అన్నవరం నుంచి గాలిపాడు మీదుగా వర్తనపల్లి వరకు రహదారి నిర్మాణ పనులు ప్రారంభం అయినప్పటికీ నేటికీ రహదారి నిర్మాణం పూర్తి కాలేదని ఆ ప్రాంత ప్రజలు సర్పంచ్ సలిమితి లక్ష్మయ్య సాక్షిగా ఆవేదన వ్యక్తం చేశారు. నేడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో నైనా రహదారి నిర్మాణ పనులు పూర్తి కావాలని తెదేపా క్లస్టర్ ఇంచార్జ్ వంతల భీమన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. రహదారి మొత్తం మెటల్ వేసి వదిలి పెట్టడం వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ఈ రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు చెప్పుకోవడానికి కూడా కానరాని అరకు ఎంపీ

కేవలం ప్రారంభోత్సవాలకు తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోని పార్లమెంట్ సభ్యురాలు

విశాలాంధ్ర-పాడేరు రూరల్ : గత సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రం మొత్తం కూటమి ప్రభుత్వ గాలి వీచినప్పటికీ మన్యం ప్రాంతంలో ఎన్నో ఆశలతో గిరిజనుల సమస్యలను తెలుసుకొని మాకు అండగా ఉంటారని ఆశతో అరకు పార్లమెంట్ నియోజకవర్గంలోని కుటమి ప్రభుత్వాన్ని కాదని ఎన్నో ఆశలతో అరకు పార్లమెంట్ నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి అయినటువంటి గుమ్మ తనుజారాణి గెలిపించడం జరిగింది. కానీ రాష్ట్రంలో వారి ప్రభుత్వం రాలేదని లేక ప్రజలతో మాకు పనిలేదు అన్న చందంగా స్థానిక పార్లమెంటు సభ్యురాలు వ్యవహార శైలి జరుగుతుంది కేవలం ప్రారంభోత్సవాల సమయంలోను లేక వారి పార్టీ కార్యక్రమాల్లోనూ తప్ప ఎప్పుడు కూడా ప్రజలకు అందుబాటులో లేని పరిస్థితి వచ్చింది కేంద్రరాష్ట్రం ప్రభుత్వాలు ప్రకటిస్తున్న పథకాలలో అర్హులైన ఆదివాసి గిరిజనులకు అన్యాయం జరుగుతున్నప్పటికీ దానిని వారు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులకు తెలియజేయాలనుకుంటే వారు అందుబాటులో ఉండటం లేదు కనీసం క్యాంప్ ఆఫీసుల్లో గాని మరి ఎక్కడ గాని వారి సమస్యలను పార్లమెంట్ సభ్యురాలికి చెప్పుకుందాం అంటే ఆవిడ ఎప్పుడూ కూడా ఢిల్లీలో ఉండడం తప్ప స్థానికంగా అటు ప్రజలకు గాని ఇటు వారి పార్టీ ప్రజా ప్రతినిధులకు గాని అందుబాటులో లేకుండా వ్యవహరించడం వలన అరకు పార్లమెంటు ప్రజలు చెప్పుకోలేని బాధలు పడుతున్నారు ఒకప్పుడు గతంలో పని చేసినటువంటి అరకు పార్లమెంట్ సభ్యులు వారి ప్రభుత్వాలు అధికారం లేకపోయినా వారికి వచ్చేటువంటి పార్లమెంట్ నిధుల నుంచి ఎంపీ ల్యాండ్స్ నుంచి స్థానికంగా ఎంతో కొంత అభివృద్ధి చేసిన దాఖలాలు ఉన్నాయి గతంలో అరకు ఎంపీగా పని చేసినటువంటి కొత్తపల్లి గీత ఏజెన్సీ ప్రాంతానికి అంబులెన్స్ పరంగాను స్థానికంగా రోడ్ల పరంగాను ఎంపీ ల్యాండ్స్ నిధుల నుంచి ఖర్చు పెట్టారు. తర్వాత వచ్చిన బొడ్డేటి మాధవి కూడా వారి ఎంపీ లాండ్స్ నుంచి స్థానికంగా బస్సు షెల్టర్లు నిర్మించడం తాగునీటి సదుపాయాలు కల్పించడంలో వారి ఎంపీ లాండ్స్ ఖర్చుపెట్టారు కానీ ప్రస్తుతం ఉన్నటువంటి అరకు ఎంపీ గుమ్మ తనుజారాణి వారి ఎంపీ లాండ్స్ నుంచి ఏ సదుపాయాలు కల్పిస్తున్నారు ప్రజలకు చెప్పలేని పరిస్థితి వచ్చింది ప్రజలకు అందుబాటులో ఉంటే వారి సమస్యలు చెప్పుకుని ఎంపీ నిధుల నుంచి స్థానికంగా అభివృద్ధి చేసే పరిస్థితి ఏర్పడుతుంది కానీ వారి సమస్యలు చెప్పుకోవడానికి స్థానిక ఎంపీ అందుబాటులో లేకపోవడంతో వారి సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు ఇప్పటికైనా అరకు ఎంపీ క్యాంపు కార్యాలయంలోనూ అరకు పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లోనూ పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని వారి సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువేలలని, పార్లమెంట్ సభ్యులకు నియోజకవర్గాలలో పర్యటించడానికి కల్పిస్తున్న ప్రయాణ సదుపాయాలైన ఉపయోగించుకుని అయినా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకోవాలని, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులనుంచి, ఎంపీ ల్యాండ్స్ నుంచి వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని వైసిపి నేతలు ప్రజలు కోరుకుంటున్నారు. ఈవిధంగానే ఎంపీ ప్రజలకు అందుబాటులో లేకపోతే వైసీపీ పార్టీ మనుగడ కూడా గిరిజన ప్రాంతంలో కనుమరుగైపోయే పరిస్థితి ఏర్పడుతుందని వైసీపీకి చెందిన ముఖ్య నాయకులు ఆందోళన చెందుతున్నారు.

పర్యాటక ప్రాంతాలలో ప్లాస్టిక్ వినియోగం నిషేధం

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు: పర్యాటక ప్రాంతాలలో ప్లాస్టిక్ వినియోగం నిషేదించామని కలెక్టర్ ఎ.ఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. పర్యావరణానికి, అడవులకు హాని కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పర్యాటక ప్రాంతాలలో రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్, రహదారులు భవనాలు, వైద్య ఆరోగ్య శాఖ, టూరిజం, రవాణా, అటవీ శాఖ, ఎక్సైజ్, ఇంజనీరింగ్ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. పర్యాటక సీజన్ ప్రారంభమైందని, పెద్ద ఎత్తున పర్యాటకులు సందర్శిస్తారని చెప్పారు. ఏజెన్సీ ముఖ ద్వారాల వద్ద పర్యాటకుల వాహనాలను, పర్యాటకులను నమోదు చేయాలని సూచించారు. పర్యాటకులు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని చెప్పారు. పర్యాటక ప్రాంతాలు, అటవీ ప్రాంతాలలో క్యాంపు ఫైర్ నిర్వహించకూడదన్నారు. నిర్దేశించిన ప్రదేశాలలో క్యాంపు ఫైర్ నిర్వహించడానికి ముందుగా అనుమతులు పొందాలని చెప్పారు. పర్యాటకులు అత్యధికంగా సందర్శించే పర్యాటక ప్రాంతాలలో వాహనాలు పార్కింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనధికారకంగా క్యాంపు ఫైరులు నిర్వహిస్తే మహిళా పోలీసులు, వి. ఆర్. ఓలు, పంచాయతీ కార్యాదర్శులు తనిఖీలు చేసి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పర్యాటక ప్రాంతాల పరిధిలో గ్రామ స్థాయి, మండల, ఐటిడి ఏ, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కమిటీలు పర్యాటక ప్రాంతాలను తనిఖీ చేయాలని చెప్పారు. అక్రమంగా మద్యం విక్రయాలు, బెల్టు షాపులు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేయాలని అన్నారు. పర్యాటకులు ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తే తప్పని సరిగా హెల్మెట్ పెట్టుకోవాలని పేర్కొన్నారు. పర్యాటక ప్రాంతాల విశిష్టతను తెలియజేసే విధంగా హెూర్డింగ్సు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ (వర్చువల్ గా) జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ, ఐటిడి ఏ పి ఓ వి. అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, పాడేరు డి. ఎఫ్. ఓ, పి.వి. సందీప్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

అనంతగిరిలో పొలం పిలుస్తుంది

విశాలాంధ్ర-అనంతగిరి : మండలంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా సచివాలయంలో రైతులకు అవగాహనా శిబిరం వ్యవసాయ అధికారిణి ఉమా మహేశ్వరీ ఏర్పాటు చేసారు. ఈరోజు కార్యక్రమానికి ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ గంగరాజు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. సాగులో మెలుకువలు వివరించారు. విత్తనాలను సకాలంలో అందించాలని, నాన్యమైన విత్తనాలు సరఫరా చేయాలనీ ఆదేశించారు. రైతులకు పంట రుణాలపై అవగాహన కల్పించారు. అనంతరం అనంతగిరి, లక్ష్మీపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం లో భాగంగా పంట పొలాల్లో పలు సూచనలు చెసారు. ఈరోజు కార్యక్రమంలో వీఏ దీపిక పాల్గొన్నారు.

రెండు ఎద్దులను దాడిచేసి చంపిన పెద్ద పులి

విశాలాంధ్ర-కూనవరం : గత కొన్ని రోజులుగా కూనవరం అటవీ ప్రాంతంలో హల్చల్ చేస్తున్న పెద్దపులి బుధవారం బోదునూరు గ్రామంలో సోడె శ్రీను అనే రైతుకు చెందిన రెండు దుక్కిటెడ్లపై దాడి చేసింది. ఒక ఎద్దుని తెల్లవారుజామున మెడ కొరికి చంపగా మరో ఎద్దుని మధ్యాహ్నం మూడు గంటలకి దాడి చేసి చంపేసింది. ఫారెస్ట్ అధికారులు సంఘటన స్థలాన్ని చేరుకొని విషయం నిర్ధారణ చేశారు. అటవీ ప్రాంతాల్లో ప్రవేశించకూడదని పులి తిరుగుతున్నందున ప్రజల అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని ఎన్‌క్యూఏఎస్ బృందం పరిశీలన

విశాలాంధ్ర-దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం నేషనల్ క్వాలిటీ అసెస్మెంట్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) వైద్య బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఎన్ క్యూ ఏ ఎస్ వైద్యాధికారి లలిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓపి గది, మందులు గది, ల్యాబ్ గదులను పరిశీలించారు. దీంతోపాటు గర్భిణీల ప్రసవాల ల్యాబ్ ను, వార్డులను సైతం ఆమె క్షుణ్ణంగా పరిశీలించి గిరిజనులకు గర్భిణీలకు ప్రభుత్వ అందిస్తున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి పి.రాంబాబు, వైద్య అధికారిని అంబిక, ఎంపీహెచ్వో శౌరి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాములుపుట్‌లో రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి : సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర-దుంబ్రిగూడ: మండలంలోని కితలంగి పంచాయతీ పరిధిలోనున్న పాముల పుట్ గ్రామానికి అసంపూర్తిగా ఉన్న రోడ్డును నిర్మాణం పూర్తి చేయాలని స్థానిక సిపిఐ పార్టీ మండల కార్యదర్శి కె.సింహాచలం డిమాండ్ చేశారు. బుధవారం ఆ గ్రామాన్ని సందర్శించిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పాముల పుట్టు గ్రామంలోనీ సుమారు 40 మంది వరకు చిన్నారులు ఉన్నారని పౌష్టికాహారం అందించే అంగన్వాడీ కేంద్రం కూడా లేదని, అదేవిధంగా ఆ గ్రామాల్లో సిసి రోడ్లు డ్రైనేజీ వంటి సౌకర్యాలు లేకపోవడంతో ఆ గ్రామస్తులు పలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట పొలాలకు ఉపయోగపడే చెక్ డ్యామ్ గత 20 ఏళ్ల నుండి అసంపూర్తిగా మిగిలిపోయి ఉందన్నారు. రోడ్డు నిర్మాణనికి నిధులు మంజూరైన ఉన్నప్పటికీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయకుండా కాంట్రాక్టర్లు వదిలేసారని ఆయన చెప్పారు. తక్షణ మే అధికార యంత్రాంగం స్పందించి పాములపుట్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మంచి లక్ష్యంతో ఎదగండి-సమాజానికి ఉపయోగపడండి

విద్యార్థులతో కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు: విద్యార్థులందరూ మంచి లక్ష్యంతో ఉన్నత స్థితికి ఎదగాలని, సమాజానికి ఉపయోగపడాలని కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ విద్యార్థులకు హితబోధ చేసారు. బుధవారం స్థానిక పరభుత్వ జూనియర్ కళాశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోరి వికాస్ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు మనసులో చెడు ఆలోచనలు లేకుండా మంచి ఆలోచనలు పెంచుకోవాలన్నారు. జీవితంలో భవిష్యత్తు కోసం మంచి లక్ష్యాన్ని నిర్దేసించుకొని ఉన్నత స్థానాలకు ఎదగడానికి ప్రణాలికా యుతంగా సిద్ధం కావాలని సూచించారు. జిల్లాలో పేదరికం వల్లనే బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వాటినుండి బయటపడాలంటే అందరూ బాగా చదువుకొని ఉపాధి అవకాశాలు మెరుగు పర్చుకోవాలని సూచించారు. అదే విధంగా జిల్లాలో గంజాయికి బానిసైన వారి సంఖ్య అధికంగా ఉందని, మందుల తయారీలో వినియోగించే గంజాయిని వినియోగించడం బాధాకరమని, దానిని అరికట్టేశక్తి యువతకే ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడుని నియమించకపోతే పిల్లలతో ఛలో కలెక్టరేట్

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్త వీధి మండలం ఏ దారకొండ పంచాయతీ పరిధి తడకపల్లి జీపిఎస్ పాఠశాలకి ఉపాధ్యాయుడు నియమించాలని స్థానిక ఎంపీటీసీ అంబురంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. తడకపల్లి జీపిఎస్ పాఠశాలలో 14 మంది విద్యార్థులు 1 తరగతి నుండి 5వ తరగతి వరకు చదువుచున్నారన్నారు. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు ఆగస్టు నెలలో వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లారని, అప్పటినుండి నేటి వరకు ఉపాధ్యాయుడును, విద్యాశాఖ అధికారులు నియమించకపోవడంతో ఉపాధ్యాయుడు లేక పిల్లలు విద్యకు దూరమై ఉన్నారని, ఈ విషయంపై విద్యాశాఖ అధికారులకు తెలియజేయడం జరిగిందన్నారు. నేటికీ ఉపాధ్యాయుడును నియమించకపోవడంతో ఎంపీటీసీ తడకపల్లి పిల్లల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. స్థానిక ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు మాట్లాడుతూ తడకపల్లి జీపిఎస్ పాఠశాల కి టీచర్ నియమించాలని లేకుంటే పిల్లలు తల్లిదండ్రులతో కలిసి చలో కలెక్టరేట్ కి తరలి వెళ్ళుటకు సిద్ధం అవుతున్నట్లు ఆయన తెలిపారు. తక్షణమే తలకపల్లి కి ఉపాధ్యాయుడు నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిల్లలు తల్లిదండ్రులు వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి

విశాలాంధ్ర-మక్కువ : శంబర గ్రామ పంచాయితీలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా శంబర ప్రజలుకు ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఎన్నో ఏళ్ల కలగా వున్న పోలమాంబ అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సిరిమాను తిరిగే రోడ్లు, డ్రెయిన్స్ ను స్త్రీ శిశు సంక్షేమం, గిరిజన శాఖా మాత్యులు గుమ్మిడి సంధ్యారాణి శంకుస్థాపన చేశారు. మొత్తం సంబర గ్రామంలో ఆరు రోడ్లకు డ్రైన్స్ కు 2.40 కోట్ల వ్యయంతో మంజూరు చేశారు. వీరదవలసి నుండి కవిరి వలస బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం కాళీపట్నం పంచాయితీ మునక్కాయవలస గ్రామంలో 55 లక్షల వ్యయంతో ఆరోగ్య ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేసిందని, ప్రభుత్వం వచ్చిన 150 రోజులలో ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపలు చేయడం, అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి చూపిస్తామని ఆమె అన్నారు.

టిడిపి గూటికి వైకాపా కౌన్సిలర్లు

ఆహ్వానించి కండువా వేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: స్థానిక మున్సిపాలిటీలో వైకాపా పార్టీకి చెందిన ఐదుగురు పాలకవర్గ సభ్యులు బుధవారం టిడిపి గూటికి చేరారు. ఎమ్మెల్యే విజయ్ చంద్ర సమక్షంలో వారు పార్టీ కండువాలు వేసుకున్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలతో పాటు పార్టీ విధానాలనుంచి స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీలో చేరడం సంతోషమని ఎమ్మెల్యే అన్నారు. వైకాపాపార్టీ పరిస్థితి ఏమిటోఅందరికీ అర్థమైందని తల్లికి ,చెల్లికి న్యాయం చేయలేదు జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి ఏమి న్యాయం చేస్తారని అంతా తెలుసుకున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఎటువంటి షరతులు లేకుండా పార్టీ విధానాలు నచ్చి తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన కౌన్సిలర్లకు స్వాగతం పలుకుతున్నామని ఆయన అన్నారు. కౌన్సిలర్లుగా గెలిచిన వీళ్లంతా తమ వార్డుల అభివృద్ధికి ఎటువంటి పనులు చేయలేకపోయారని జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో కూడా ఎటువంటి నిధులు ఇవ్వక అభివృద్ధి కుంటుపడిందని ఆవేదనతో ప్రతి కౌన్సిలర్ ఉన్నారని ఎమ్మెల్యే అన్నారు. వాస్తవాలను గుర్తించి తెలుగుదేశం పార్టీతోనే ప్రజలకు న్యాయం చేయగలమని గుర్తించి ముందుకు రావడం సంతోషమని ఆయన పేర్కొన్నారు. టిడిపి గూటికి చేరిన వారిలో ఏడు, తొమ్మిది,పది, పదకొండు, పన్నెండు, వార్డుల కౌన్సిలర్లు బొత్స ఆనంద్, రావాడ జయంతి, జలుమూరు దివ్య, వారణాసి కళ్యాణి, తాడ్డి. అరుణ్ కుమారి ఉన్నారు.

జిల్లాలో సంచరిస్తున్న ఏనుగులను తక్షణమే తరలించాలి

పార్వతీపురం నియోజకవర్గం ఇంచార్జ్ బత్తిన మోహన్ డిమాండ్

విశాలాంధ్ర-బెలగాం: జిల్లాలో సంచరిస్తున్న ఏనుగులను తక్షణమే తరలించాలని పార్వతీపురం నియోజకవర్గం ఇంచార్జ్ బత్తిన మోహన్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో ఏనుగులు సంచరిస్తూ వివిధ గ్రామాలలో ప్రాణా నష్టం మరియు పంట నష్టాన్ని కలిగిస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయన్నారు. అటవీ శాఖ అధికారులు ఎంత అప్రమత్తం చేసినప్పటికీ కూడా ఎన్నో ప్రాణాలను గజరాజులు బలి తీసుకున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే ఏనుగలను పట్టించి వేరే ప్రాంతాలకు తరలించాలని లేదంటే ప్రజలు ప్రాణాలను గుప్పట్లో పెట్టుకుని బ్రతుకుతున్నారని, పొలం పనులకు వెళ్లే వాళ్ళు తిరిగి ఇంటికి రాలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. ఇటీవల పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామం లో ఏనుగు దాడిలో మరణించిన యాకోబు కుటుంబానికి ప్రభుత్వం తరపున శాశ్వత పరిష్కారంగా ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో పార్వతీపురం మండల కాంగ్రెస్ అధ్యక్షులు టి. గౌరీ శంకర్, యువజన కాంగ్రెస్ నాయకులు పట్లసింగు రవికుమార్, చింతాడ నారాయణరావు, ముద్దాడ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు ఎం.ఎల్.ఎస్ పాయింట్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-సాలూరు : సాలూరు మండల కేంద్రం లోని పౌర సరఫరాల మండల స్థాయి స్టాక్ పాయింట్ (ఎం.ఎల్.ఎస్) ను పార్వతీ పురం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోశ్ శ్రీవాస్తవ బుధవారం ఆకస్మిక తనిఖీ చేసారు. రిజిష్టరులో నమోదైన మేరకు స్టాక్ పాయింట్ లోని సరుకులను పరిశీలించారు. సకాలంలో రేషన్ సరుకులు ప్రజలకు చేరవేయాలని, అందుకు సంబంధించిన అన్ని చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల అధికారులను పిఒ ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్లు పక్కాగా ఉండాలని, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ పర్యటనలో పౌర సరఫరాలు,రెవిన్యూ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్దే లక్ష్యంగా కలసి పనిచేద్దాం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పట్టణ అభివృద్దే లక్ష్యంగా అందరం పార్టీలకతీతంగా కలసి పనిచేద్దామని శాసనసభ్యులు బోనెల విజయచంద్ర అన్నారు. బుధవారం మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన పురపాలక సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది.సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలపై స్పందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 9, 10, 14, 13, 20, 21 తదితర అన్నివార్డుల్లో కాలువల ఏర్పాటు అవసరం ఉందని మురుగు సమస్య తీవ్రంగా వేధిస్తుందని పరిస్థితిని గమనించడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు.దశలవారీగా ఎవరికి ఇబ్బందులు లేకుండా అన్నిచోట్ల కాలువల నిర్మాణానికి ఆలోచన చేస్తున్నట్లు ఆయన తెలిపారు పార్టీలను పక్కనపెట్టి పట్టణాభివృద్ధి ధ్యేయంగా అందరు సహకారంతో ముందుకు వెళ్దామని అందుకు అంతా సహకరించి ముందుకు రావాలని ఎమ్మెల్యే కోరారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు, మేనేజర్ జి లక్ష్మి, అసిస్టెంట్ ఇంజనీర్లు సన్యాసిరావు అప్పారావు రెవెన్యూ అధికారి రూబేన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు ఈశ్వరరావు వినయ్ కుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ కెవిపి రాజు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ అశోక్, తోపాటు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో సభ్యత్వ నమోదు లక్ష్యం పూర్తి చేయాలి

ఎమ్మెల్యే జగదీశ్వరీ, రాష్ట్ర కార్యదర్శి వీరేష్ దేవ్

విశాలాంధ్ర-కురుపాం : తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అదిష్టానం కురుపాం నియోజకవర్గానికి నిర్దేశించిన లక్ష్యం సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరీ, రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ దేవ్ కోరారు.బుధవారం "కురుపాం ప్యాలెస్" లో మండల పార్టీ అధ్యక్షుడు కలిశెట్టి కొండయ్య ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతిఒక్క కార్యకర్తకు అధిష్టానం అండగా ఉంటుందని జీవిత భీమా, నిరుపేద పిల్లల చదువులు లకు తోడ్పాటు ఉంటుందని అన్నారు. తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, మాజీ ఎంపీపీ జివి రమణమూర్తి, మాజీ జడ్పీ కోఆప్షన్ మెంబర్ రంజిత్ కుమార్ నాయక్, వివిధ పంచాయతీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-బలిజిపేట: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారం చేయాలని,గ్రామ రెవెన్యూ సహాయకులకు ప్రభుత్వం న్యాయం చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా నైట్ డ్యూటీలు, ఇసుక కాపలా ఇతర డ్యూటీలను రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న వాచ్మెన్ అటెండ,ర్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు భర్తీ చేయాలని, డ్యూటీలు వేసినవారికి టీఏ, డిఎ ఇవ్వాలని పెరుగుతున్న ధరలకు అనుకూలంగా జీతభత్యాలు పెంచాలని కోరుతూ బుధవారంనాడు తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో వి ఆర్ ఎలు సుధా, బాబురావు, శ్రీను, నక్షత్రమ్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

అందరూ కాలుష్య రహిత దీపావళి చేసుకోవాలి

జిల్లా జనవిజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు రేవళ్ళ సతీష్ రాజు

విశాలాంధ్ర-సీతానగరం : అందరూ కాలుష్య రహిత దీపావళి పండుగను చేసుకోవాలని జిల్లాజనవిజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు రేవళ్ల సతీష్ రాజు తెలిపారు. బుధవారం నాడు నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల చేత కాలుష్య రహిత దీపావళి జరుపుకోవాలని ప్రతిజ్ఞచేయించారు, ఈకార్యక్రమములో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు గౌరునాయుడు, సెక్రటరీ మహేష్, మహిళా అధ్యక్షులు శైలజ సతీష్ రాజు మాస్టారికి అభినందనలు తెలిపారు. జోగంపేటలోని కేజీబీవీలో హరిత దీపావళి పండుగను జరుపుకున్నారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ సంధ్య ఉపాధ్యాయులు శైలజ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని గెద్దలుప్పి కూడలిలో ఉన్న కృషి విద్యానికేతన్ లో ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. దీపాలను మధ్యలో పెట్టి విద్యార్థిని విద్యార్థులు నమస్కారాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలోకరస్పాండెంట్ ద్వారపు రెడ్డి శ్రీనివాసరావు, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సివిల్ సర్వీస్ క్రీడల్లో వ్యాయామ ఉపాధ్యాయులు విజయకేతనం

విశాలాంధ్ర-సీతంపేట : ఐటిడిఎ పరిధిలో వ్యాయామ ఉపాధ్యాయులు మన్యం పార్వతీపురం లో జరిగిన ప్రభుత్వ సివిల్ సర్వీసెస్ క్రీడలలో వ్యాయామ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు వివిధ క్రీడల్లో విజయకేతనం ఎగరవేశారు. వి.ఎ. భాస్కరరావు వంద మీటర్ల పరుగు పందెంలో గెలుపొందారు. ఎస్.కళ్యాణ్‌కుమార్, ఖోకో ఎం.జనార్ధనరావ ఈశ్వరరావు జావలిన్ త్రో కబడి శైలజ, షాట్‌పుట్, జావెలిన్ ప్రమీల, లాంగ్ జంప్, హైజంప్‌లలో విజయకేతనం ఎగుర వేశారు. విజయం సాధించినవారికి ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి యశ్వంత్ కుమార్, డిడి అన్న దొర్రై, ఏటిడబ్ల్యుఓ మంగవేణి అభినందించారు.

ఆధార్ తరహాలో అపార్ కార్డ్

కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో ఆధార్ తరహాలో ఉండే అపార్ కార్డులను విద్యార్థులకు జారీచేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరిత గతిన పూర్తిచేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ ఒక్క అపార్ నంబర్‌తో విద్యార్థి చరిత్ర మొత్తం తెలిసిపోతుందని, విద్యార్థుల కోసం ప్రత్యేక గుర్తింపు కార్డు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని కలెక్టర్ చెప్పారు. అపార్ పేరుతో వన్ నేషన్-వన్ ఐడీ పేరిట విద్యార్థులకు కార్డులను జారీచేయడం దీని ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

చీకట్లను చెరిపేసే దీపావళి అందరి జీవితాల్లో నూతన కాంతులు నింపాలి

పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డిలు

విశాలాంధ్ర-పార్వతీపురం : చీకట్లను చెరిపేసే దీపావళి అందరి జీవితాల్లో నూతన కాంతులు నింపాలని, జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, పాత్రికేయ మిత్రులకు, సిబ్బందికి దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డిలు తెలిపారు. బుధవారం నాడు వారు వేర్వేరుగా దారి చేసిన ప్రకటనలో తెలియజేశారు. ప్రజలందరూ సరైన జాగ్రత్తలు పాటిస్తూ ఆనందోత్సహాలతో దీపావళి పండుగను జరుపుకోవాలని సూచించారు. చీకటిపై వెలుగు, చెడుపైమంచి, అజ్ఞానంపైజ్ఞానం, దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయాలకు ప్రతీకగా జరుపుకునే దీపావళిని పండుగను జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆనందంగా జరుపుకోవాలని, చీకట్లను చెరిపేసే దీపావళి అందరి జీవితాల్లో నూతన కాంతులు నింపాలని, ప్రజలందరికి సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని వారు ఆకాక్షించారు. ప్రమాదాలకు దూరంగా ఉండి దీపావళి పండుగను ప్రజలు జరుపుకోవాలని, తల్లిదండ్రుల సమక్షంలో మాత్రమే పిల్లలు జాగ్రత్తగా టపాసులు కాల్చాలని విజ్ఞప్తి చేశారు.

దీపావళి పండుగను సాంప్రదాయబద్ధంగా, సురక్షితంగా జరుపుకోవాలి : సిఐ దుర్గాప్రసాద్

విశాలాంధ్ర-చింతూరు : చింతూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ తెల్లం దుర్గారావు దీపావళి బాణాసంచా కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకొని సురక్షితంగా దీపావళి పండుగ చేసుకోవాలని చింతూరు మండల ప్రజలను ఒక పత్రిక ప్రకటన ద్వారా కోరారు. ప్రభుత్వం సూచించిన నియమనిబంధనలు పాటించి దీపావళి బాణాసంచా విక్రయించే దుకాణదారులు అన్ని భద్రత ఏర్పాట్లు చేయాలని, జనావాసాలకు విద్యాసంస్థలకు, వైద్యశాలకు దూరంగా బాణాసంచా విక్రయాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రమాదాలు జరగక ముందే జాగ్రత్తలు ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లలు బాణాసంచా కాల్చే సమయంలో తల్లిదండ్రులు దగ్గర ఉండి సురక్షితంగా బాణాసంచా కాల్చే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. చింతూరు పోలీస్ సర్కిల్ తరపున మండల ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్‌లు సీజ్

విశాలాంధ్ర-వై.రామవరం : వై.రామవరం మండలం దేవర మడుగుల పెద్దేరు వాగు వద్ద 3 ఇసుక ట్రాక్టర్‌లను రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ సీజ్ చేసి స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఇసుక ట్రాక్టర్‌లపై విచారణ చేసి నివేదికలు అందించాలని తహసీల్దార్ వేణు గోపాల్‌ను ఆదేశించారు. దీనిపై తహసీల్దార్ వేణుగోపాల్ బుధవారం విచారణ జరిపామన్నారు. ఒక ట్రాక్టర్‌కు సంబంధించి హౌసింగ్ కాలనికీ ఇసుక తరలిస్తున్నట్లు తేలిందని మిగిలిన రెండు ట్రాక్టర్ల ఇసుక తరలింపుపై ఎంక్వైరీ చేయాల్సి ఉందన్నారు. విచారణలో ఆర్ఐ శాంతికుమారి పాల్గొన్నారు.

నిర్వాసితులకు త్వరలో పరిహారం చెల్లిస్తాం : సబ్ కలెక్టర్

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : జాతీయ రహదారి 516 నిర్మాణంలో భాగంగా పొలాలు,ఇల్లు కోల్పోయిన వారిలో కొంతమందికి పరిహారం అందలేదు, అదే విషయమై బుధవారం రాజవొమ్మంగి వచ్చిన సబ్ కలెక్టర్ కల్పనశ్రీ మాట్లాడుతూ నిర్వాసితులకు తొందరలో ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని తెలిపారు, మండలంలో చేరుకుంపాలెం నుండి సరబ వరం వరకు పరిహారం అందని ఇళ్లను,పొలాలను పరిశీలించారు, ఆమె వెంట హైవే అధికారులు, ఆర్&బి అధికారులు, రాజవొమ్మంగి రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

జిటిడబ్ల్యూ పాఠశాలలో బాలికలకు కంటి పరీక్షలు

విశాలాంధ్ర-జీకే వీధి : జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డిపిఎమ్ఓ డాక్టర్ టీ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో, జి.కె.వీధి పీహెచ్సీ పరిదిలో రింతాడ జిటిడబ్ల్యూ బాలికల హాస్టల్‌లో 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు డిస్ట్రిక్ట్ బ్లైండ్ కంట్రోల్ సొసైటీ పిఎంయుఓఎస్ వి.రమణ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 820 మందిలో 724 మందికి కంటి పరీక్షలు తనిఖీ నిర్వహించి, అందులో 21 మందికి, దృష్టి లోపం గుర్తించి, వారికి ఉచితంగా కళ్లద్దాలు ఇవ్వడం జరుగుతుందనీ తెలిపారు. మైనర్ ఎలిమెంట్‌గా 35 మంది విద్యార్థులను గుర్తించి వారికి కంటి డ్రాప్స్, మాత్రలు ఇవ్వడమైన్నారు. ఈకార్యక్రమంలో కె.సింహాచలం, ఎల్.భాగ్య లక్ష్మి, సచివాలయం, కుమారి, హెల్త్ అసిస్టంట్, ఎం.సత్య నారాయణ, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు పి.పాపియమ్మ ,వార్డెన్, జె .విజయ కుమారి, హాస్టల్ కృష్ణవేణి, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

కోతుల బెడద నివారించాలి

విశాలాంధ్ర -ఎటపాక: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో కోతుల బెడద భరించలేక పోతున్నామని లక్ష్మి పురం పిహెచ్‌సి సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. కోతులు ఆసుపత్రి లోపలకు జోరబడి ఆసుపత్రి సామాగ్రి నాశనం చేయడమే కాకుండా రోగులు, ఆసుపత్రి సిబ్బంది పై దాడికీ పాల్పడుతున్నాయని, ఏది దొరికితే అది ఎత్తుకెళ్లుతున్నాయని, అదిలించబోతే మీదపడి కరుస్తున్నాయని, చేతిలోనో, సంచిలోనో ఏదైనా తీసుకుని వీధుల్లో నడుస్తున్నవారిపైనా దాడిచేసి గాయపర్చుతున్నాయని ఆవేదన చెందు తున్నారు. దీనికి కారణం ఆసుపత్రి ఆవరణ లోపై కప్పు ఓపెన్‌గా ఉండడం వల్ల లోపలికి కోతులు వస్తున్నాయని, అంతేకాకుండా ఆసుపత్రి గేట్ లేకపోవడంతో లోపలికి వెళ్లి వస్తువులని చిందరవందర చేస్తున్నాయని ఆరోపించారు. కోతుల బెడద నుండి కాపాడాలని స్థానిక గ్రామ సబ్యులు నాయకులు రాంబాల నాగేశ్వరావు, వరద బ్రహ్మం, మొల సతీష్,ఆసుపత్రి సిబ్బంది కోరుతున్నారు.

పెదపెంకిలో బోధ వ్యాధి ర్యాండం సర్వే

విశాలాంధ్ర-పార్వతీపురం : బలిజిపేట మండలంలోని పెదపెంకి గ్రామంలో నవంబరు 4, 5, 6 తేదీల్లో బోధవ్యాది ర్యాండం సర్వేను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రగతిపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం కలెక్టర్ సమీక్షించారు. పెదపెంకి పంచాయతీ పరిధిలో దాదాపు 4.80 కిలోమీటర్ల మేర మురుగు నీటి కాలువల నిర్మాణానికి రూ.3.73 కోట్లు మంజూరు చేసినట్లు ఆయన చెప్పారు. ఇదిలాఉండగా నెలలో కనీసం 70 గ్రామ సచివాలయాల పరిధిలో కంటి వెలుగు కార్యక్రమం జరగాలని ఆయన ఆదేశించారు. భామిని, బత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో టిబి తనిఖీలు మెరుగుపడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నెలసరి లక్ష్యాల్లో 36 శాతం మాత్రమే సాధించడాన్ని ఆయన ప్రశ్నించారు. గంజ వంటి మాదక ద్రవ్యాలు సీజ్ అవుతున్న ప్రాంతాల్లో టిబి గుర్తిస్తే అందుకు ధూమపానం ఏ మేరకు కారణం అవుతుంది అనే విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు. టిబి కేసుల వివరాలను తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు అందించాలన్నారు. మహిళా పోలీసు సేవలను వినియోగించు కోవాలని ఆయన అన్నారు. రక్త హీనత నివారణకు గ్రామ స్థాయిలో రక్తహీనత నివారణ కార్యాచరణ కమిటిని ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కమిటీలో వైద్య ఆరోగ్యశాఖ, అంగన్వాడి సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. పర్యవేక్షణ చేయుటకు కార్డును రూపొందించాలని ఆయన చెప్పారు. పౌష్టిక ఆహారం తీసుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన ఆదేశించారు. రక్త హీనత సమస్య నుండి జిల్లా ముక్తి పొందాలని ఆయన చెప్పారు. ఇందులో మంచి ఫలితాలు సాధించిన వారికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. రక్త దాన శిబిరాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. వసతి గృహాల్లో చిన్నారులకు రక్తహీనత పరిస్థితి గమనిస్తే సంబంధిత అధికారులకు, వసతి గృహ సంక్షేమ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆయన ఆదేశించారు. హిమోగ్లోబిన్ పర్యవేక్షణకు విద్యార్థులకు కార్డులను జారీ చేస్తున్నామని, ఉపాధ్యాయులు నమోదు చేస్తారన్నారు. జిల్లాకు కొత్త అంబులెన్సులు రానున్నాయని ఆయన చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరగాలని ఆయన అన్నారు. గర్భం దాల్చిన సమయం నుండి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొంది ప్రసవాలు సమయంలో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్ళటంపై విచారణ జరపాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నివారణపై నీడ్ సంస్థ రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు.

ఈసమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ పార్వతి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.బి. వాగ్దేవి, ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్, డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓలు డా.టి.జగన్మోహనరావు, డా.పద్మావతి, ఆర్‌బిఎస్‌కె జిల్లా సమన్వయ అధికారి డా పి ఎల్ రఘు కుమార్, జిల్లా మలేరియా అధికారి వై మణి, జిల్లా టిబి నివారణ అధికారి ఎం నారాయణ రావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారి సుబ్బారావు, ఎన్‌టిఆర్ వైద్య సేవ మేనేజర్ రాంబాబు, ఆసుపత్రుల పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ఎస్ ఎఫ్ ఐ డిమాండ్

విశాలాంధ్ర-బలిజిపేట: మండల కేంద్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని, మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యార్థులు ధర్నా బుధవారం నాడు కాంప్లెక్స్ రోడ్ నుండి తహసిల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ కొద్దిసేపు ధర్నా చేపట్టిఎమ్మార్వోకు వినతి పత్రం ఇవ్వడం ఇచ్చారు.ఈసందర్భంగా పార్వతీపురం మన్యంజిల్లాఎస్ ఎఫ్ ఐ కమిటీ సభ్యుడు డేవిడ్ మాట్లాడుతూ ఈనెల 30 వరకు మండలాల్లో ధర్నాలు, నవంబర్ 2 నుంచి 4వరకు కలెక్టరేట్ వద్ద దీక్షలు, నవంబర్ 6న చలో కలెక్టరేట్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని, పెండింగ్లో ఉన్న 3,480 కోట్లు విద్యదీవెన, వసతిదీవెన బకాయిలను విడుదల చేయాలని, డిగ్రీలో మేజర్,మైనర్ ఆన్సర్ విధానాన్ని రద్దు చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్స్, ఏయనం పోస్టులను భర్తీ చేయాలని, ఖాళీగా ఉన్న సంక్షేమ హాస్టల్లో పోస్టులు భర్తీ చేయాలని తదితర డిమాండ్లను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

జనజీవన ప్రవంతిలోకి కలిసిపోయిన మహిళా మావోయిస్టు

విశాలాంధ్ర-చింతూరు : సిపిఐ (మావోయిస్టు) పార్టీ, సౌత్ బస్తర్ డివిజనల్ కమిటీ, టైలరింగ్ టీం, సభ్యురాలు అయిన సోడి సుక్కి వయస్సు (25) ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం, సుక్మా జిల్లా, చింతగుప్ప పోలీస్ స్టేషన్ పరిధి, దులోడ్ గ్రామస్తురాలు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, చింతూరు ఏఎస్‌పి పంకజ్ కుమార్ మీనా, ఎదుట బుధవారం లొంగిపోయారు. ఆమె గురుంచి ఏ యస్ పీ పంకజ్ కుమార్ మీనా విలేఖరుల సమావేశంలో వివరించారు. మావోయిస్ట్ పార్టీ, సౌత్ బస్తర్ డివిజనల్ కమిటీ, టైలరింగ్ టీం, సభ్యురాలు సోడి సుక్కి, (25), తన తల్లిదండ్రులైన సోడి పొజ్జ మరియు నందే దంపతులకు ముగ్గురు సంతానంలో మూడవ సంతానంగా దులోడ్ గ్రామం, చింతగుప్ప పోలీస్‌స్టేషన్ లిమిట్స్, సుక్మా జిల్లా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జన్మించిందని జనవరి నెల 2023 సంవత్సరం నుండి జూన్ నెల 2023 సంవత్సరం వరకు ఆరు నెలలపాటు శిక్షణ పొందిన తరువాత, జులై నెల 2023 సంవత్సరంలో కేసా-సోడి సుక్కికి పార్టీ సభ్యురాలుగా పదోన్నతి ఇచ్చి అగ్రికల్చరల్ టీంకు బదిలీ చేశాడు. అప్పటి నుండి ఫిబ్రవరి 2024 వరకు పనిచేసిందన్నారు. తరువాత మార్చి నెల 2024 సంవత్సరంలో దేవే, టైలరింగ్ టీం ఇన్చార్జి, సౌత్ బస్తర్ డివిజనల్ కమిటీ, ఈమెను టైలరింగ్ టీంకి తీసుకోవడం జరిగింది. అప్పటి నుండి జూన్ నెల 2024 సంవత్సరం వరకు టైలరింగ్ టీంలో పార్టీ సభ్యురాలుగా కొనసాగింది. మావోయిస్టు పార్టీ యొక్క సిద్ధాంతాలకు విసిగిపోయి పార్టీలో పనిచేసినప్పుడు మావోయిస్టు పార్టీకి చెందిన ఆదివాసియేతర నాయకుల నుండి వివక్షత వుందని మావోయిస్టు పార్టీకి ప్రజల్లో ఆదరణ తగ్గిపోవడం మరియు పార్టీ భావజలం మీద భ్రమలు తొలిగిపోవడం మావోయిస్టు పార్టీకి పట్టున్న ప్రదేశాలలో పోలీసులు గస్తీ పెరగడం మరియు కొత్త పోలీస్ క్యాంప్‌లు పెట్టడంవల్ల స్వేచ్ఛగా తిరగలేక మావోయిస్టు అగ్రనేతల బట్టలు ఉతకడం మరియు మావోయిస్టు టాప్ కేడర్ ఇతర వ్యక్తిగత పనులు వంటివి చేయించడంపై విరక్తి చెంది అగ్రనేతలు ఇలాంటి పనులు అప్పగించుట ద్వారా తాను లొంగిపోతున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అల్లూరి జిల్లాలో సత్ఫలితాలు ఇస్తున్న "పరివర్తన కార్యక్రమం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలవల్ల మావోయిస్టులు సరెండర్ & రిహాబిలిటేషన్ పాలసీల ప్రకారం, లొంగిపోయిన తర్వాత ప్రశాంతమైన జీవితాన్ని గడపడానికి సోడి సుక్కికి 1 లక్ష రివార్డ్, అర్హత ఉన్న అన్ని ఇతర సౌకర్యాలు అందించబడతాయన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ అఫ్ పోలీసు పంకజ్‌కుమార్ మీనా మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని, జనజీవన ప్రవంతిలో కలిసి వ్యక్తిగతంగా అభివృద్ధి చెందాలని అదేవిధంగా తమ కుటుంబసభ్యులను అభివృద్ధి పథంలో నడిచే విధంగా తోడ్పడాలని మావోయిస్టులకు పిలుపు నిచ్చారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వపరంగా రావలసిన అన్ని రాయితీలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. మావోయిస్టు పార్టీ నుండి బయటకు వచ్చి జనజీవన ప్రవంతిలో కలవాలి అనుకొనేవారు స్వచ్ఛందంగాని, బంధుమిత్రుల ద్వార గాని తమ దగ్గర లోని పోలీసు స్టేషన్ లో గాని, లేదా జిల్లా పోలీసు ఉన్నత అధికారులును గాని సంప్రదించగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ టీ.దుర్గాప్రసాద్, యస్ఐ పి.రమేష్, పి.దివాకర్, అసిస్టెంట్ కమాండెంట్, ఈ కొయ్, 42 బియన్ సిఆర్పిఎఫ్ ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఐఓ తనిఖీ

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మండలం బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని బాలగుడబ హెల్త్ వెల్నెస్ సెంటర్ ను జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ (డిఐఓ) డా. ఎం. నారాయణ బుధవారం తనిఖీ చేశారు. ముందుగా సెంటర్లో రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకొని రికార్డులో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. చికిత్స కొరకు వచ్చే ప్రతీ రోగి పట్ల తక్షణమే స్పందించి వారు ఎటువంటి ప్రయాస పడకుండా తగు నిర్దేశం చేస్తూ సంతృప్తితో తిరిగి వెళ్ళేలా వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. సీజనల్ జ్వరాలు ఏ మేరకు నమోదు అవుతున్నాయి, మలేరియా, డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు, మందుల లభ్యత వివరాలపై అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ తనిఖీ చేశారు. రక్త, మూత్ర పరీక్షల ఫలితాలు సకాలంలో అందజేయాలని ఆదేశించారు. మందుల కాలపరిమితిని ఎప్పటికప్పుడు తనిఖీ చేసి సకాలంలో వినియోగించేలా చూడాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది వారికి నిర్దేశించిన విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా, నిబంధనలు అతిక్రమించినా ఆ సిబ్బందిపై తగు శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ మధ్యకాలంలో పిల్లల్లో ఎవరికైనా జ్వరాలు, సీజనల్ వ్యాదులు నమోదు అయ్యాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో మరియు పరిసరాల్లో శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ప్రస్తుత సీజన్లో డెంగ్యూ జ్వరాలకు ఆస్కారం ఉన్నందున జ్వర లక్షణాలను గుర్తిస్తే వెంటనే జిల్లా ఆసుపత్రిలో డెంగ్యూ నిర్ధారణ కేంద్రంలో (ఎస్ఎస్ హెచ్) పరీక్షలు జరిపించాలన్నారు. అదేవిధంగా జ్వర లక్షణాలను బట్టి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు. చిన్నారుల త్రాగు నీరు పరిశుభ్రంగా ఉండాలని, ఆహార పదార్థాలపై మూతలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్య నిర్వహణ రికార్డులో బరువు, ఎత్తు, శారీరక ఎదుగుదల వివరాల నివేదికలు పరిశీలించారు. ప్రతీ నెలా పురోగతి లేనట్లు గుర్తిస్తే ఎన్ఆర్సి కేంద్రంలో చేర్చాలన్నారు. వైద్య, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పిల్లల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్ జయగౌడ్, ఎంఎల్ హెచ్పి జగదీష్, ఎఎన్ఎం రామలక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా జాతీయ ఆయుర్వేద దినోత్సవం

విశాలాంధ్ర-బెలగాం : జాతీయ ఆయుర్వేద దినోత్సవం (ధన త్రయోదశి - ధన్వంతరి జయంతి) సందర్భంగా బూర్జ ఆయుర్వేదిక్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. టి. హేమక్షి మొట్ట మొదటి భారతీయ వైద్యం ఆయుర్వేదం ఆవిర్భవానికి మూల కారకులైన ధన్వంతరి ఆవిర్భావం గురించి తదుపరి ఇతిహాసాలు, సంహితులలో ఆయుర్వేదం యొక్క ముఖ్య ఉద్ధేశ్యం గురించి వివరించారు. కార్య క్రమంలో భాగంగా జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, ఎం.ఈ సూరిదేముడు ఆధ్వర్యంలో ఔషద మొక్కలు వాటి ఉపయోగాలు గురించి వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈ కార్యమంలో ఆయుష్ సిబ్బంది, యోగ ఇన్ స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా పార్టీ నిలుస్తుంది

విశాలాంధ్ర -పార్వతీపురం టౌన్: ప్రతి కార్యకర్తకు అండగా పార్టీ నిలుస్తుందని శాసనసభ్యులు విజయ్ చంద్ర అన్నారు. బుధవారం పట్టణంలో పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూతెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు జాతీయ నాయకులు లోకేష్ బాబు ప్రతి కార్యకర్త వెనుక ఉంటామని కార్యకర్తలకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారని ఎమ్మెల్యే అన్నారు. ఆ విషయాన్ని నియోజకవర్గ ప్రజలు గుర్తించారని అందుకే సభ్యత్వ నమోదులకు ముందుకు రావడంతో రికార్డు స్థాయిలో సభ్యత నమోదు జరుగుతున్నాయని అన్నారు .మరింత ఉత్సాహంతో రాష్ట్రంలోనే నియోజకవర్గంలో మంచి గుర్తింపు తీసుకురావాలని అందుకు ప్రతి ఒక్కరు సభ్యత నమోదు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహేంద్రపురం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకి వినతి

విశాలాంధ్ర -కురుపాం : మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ మహేంద్రపురం గ్రామస్తులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికు పలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెయిన్ రోడ్డు నుండి గ్రామానికి 450 మీటర్లు బీటీ రోడ్డు, మధ్యలో వాగు వద్ద స్లాబ్ కల్వర్టు నిర్మాణం చేసి ప్రమాదాలు నివారించాలని,గ్రామంలో కమ్యూనిటీ భవనం మంజూరు చేయాలని విన్నవించామని తెలిపారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారని గ్రామస్తులు తెలిపారు.

సైబర్ క్రైములు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-కొమరాడ : ఇటీవల జరుగుతున్న సైబర్ క్రైమ్ లో ఆన్లైన్ మోసాలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొమరాడ ఎస్సై నీలకంఠం అన్నారు. బుధవారం మండలంలోని గుమడ గ్రామంలో సివిల్ రైట్స్, ఆన్లైన్ మోసాలు, సైబర్ క్రైమ్ వట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆన్లైన్ మోసాలు అధికంగా జరుగుతున్నాయని అన్నారు. మరో వైపు ప్రజల బ్యాంకు ఖాతాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు సైబర్ క్రైమ్ లో చేసి ప్రజల డబ్బును దోచుకుంటున్నారని తెలిపారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఓటీపీలు ఏటీఎం కార్డు యొక్క వివరాలు అడిగినా కచ్చితంగా ప్రజలు ఎవరూ కూడా వివరాలను తెలుపకుండా ఉండాలని సూచించారు. మెరీ పైపు ఫోన్ చేసి బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం మీరు కేవైసీ చేసుకోండి అని ఏ ఒక్క ఫోన్ కాల్ వచ్చినప్పటికీ సంబంధిత వివరాలు ఏవి తెలుపకుండా ఉండాలని సూచించారు. బ్యాంకు వివరాలు ఇతర వివరాలు తెలిపితే తమ యొక్క ఖాతాలో ఉన్న నాకొద్దును ఆన్లైన్లో ద్వారా ప్రజలకు తెలియకుండా డబ్బులు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది కాబట్టి ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మెరువైపు ఈజీ మనీతో ప్రజలను మోసం చేసేందుకు ఆన్లైన్లో అనేక బెట్టింగ్ యాప్ లో గేమింగ్ యాప్ లతోపాటు ఇతర రకాల యాప్లు కూడా ప్రస్తుతం ఆన్లైన్లో అందుబాటులో ఉన్నాయని వాటి జోలికి ప్రజలు వెళ్తే భారీగా నష్టపోయే అవకాశం ఉందని అన్నారు. ఇటీవల కాలంలో తక్కువ నగదు ఆన్లైన్లో పెడితే ఎక్కువ నగదు ఇస్తామని ఆశ చెప్పి ఆన్లైన్లో కేటుగాళ్లు మోసం చేసి ప్రజలను నట్టేట ముంచుతున్నారని తెలిపారు. అలాగే సివిల్ రైట్స్ పై అవగాహన కల్పిస్తూ ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది మహిళా పోలీసు ప్రజలు ఉన్నారు.

సామాన్యులకు అందుబాటులోలేని బాణాసంచా సామాగ్రి

- పండుగతో అటు దీపావళి సామాన్లు, ఇటు నిత్యావసర సరుకులకు రెక్కలు
- మామూళ్ల మత్తులో అధికారులు

విశాలాంధ్ర-పాడేరు : పండుగ సందర్భంగా ఆహ్లాదకరంగా కుటుంబంతో గడపాలని ప్రజలు ఎన్నో ఆశలతో పండుగ సరుకులు కొందామంటే దీపావళి సామాన్లతో పాటు నిత్యవసర వస్తువుల అధిక ధరలు ప్రజలను అయోమయ పరిస్థితికి గురి చేస్తున్నాయి. దీపావళిపండుగ ఆనందంగా జరుపుకోవాలంటే సామాన్య ప్రజలు అప్పులు చెయాలిసిన పరిస్థితినెలకొంది. దీపావళి సమగ్ర ధరలను అదుపు చేయాల్సిన అధికారులు మిన్న కుండిపోవడం, పాటించుకోకపోవడం వల్లనా వ్యాపారస్తులు చెలరేగిపోయి మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా వారి వ్యాపారాలను సామాన్య ప్రజలకు అందుబాటు లేకుండా దర్జాగా వ్యాపారం కొనసాగిస్తున్నారు.మా వ్యాపారం కోసం పంచాయతీ కి 4000, అగ్ని మాపక కేంద్రానికి 6000,ఎం ఆర్ ఓ ఆఫిస్ 5000,సబ్ కలెక్టర్ ఆఫిస్ 5000 చలన 600,పోలీస్ స్టేషన్ 7000, జి ఎస్ టి 3500, టెంట్ 5000 చొప్పున ఇచ్చామని అందుకే అధిక ధరలు అమ్ముతున్నామని వ్యాపారస్తులు చెబుతూ సామాన్యుల జేబులను కొల్లగొడుతున్నారు. దీనివలన సామాన్య ప్రజలుపండగలు చేసుకోవాలంటేభయభ్రాంతులకు గురి అయ్యే పరిస్థితి నేడు నెలకొని ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. అదుపు చేయాల్సిన అధికారులు మామూలు తీసుకొని వ్యాపారస్తులకు కొమ్ముకాస్తూ చూసి చూడనట్లుగా వ్యవహరించడం చాలా విడ్డూరంగా ఉందనిప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులుస్పందించి సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా విక్రయాలు జరపాలని వ్యాపారస్తులకు హెచ్చరికలు జారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆ విధంగా అధికారులు చొరవ తీసుకుంటారో లేదో వేచి చూద్దాం.

సకల సదుపాయాలతో పర్యాటక ప్రియులను ఆకర్షిస్తున్న 'మీనా రిసార్ట్స్'

నిర్వాహకురాలు మీనాక్షి



విశాలాంధ్ర-చింతపల్లి : పర్యాటక ప్రియులకు సకల సదుపాయాలతో రిసార్ట్స్ ను అన్ని హంగులతో ముస్తాబు చేసి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని మీనా రిసార్ట్స్ నిర్వాహకురాలు మీనాక్షి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఆంధ్రా కశ్మీర్ గా పేరొందిన లంబసింగి, తాజంగి గ్రామాల నడుమ లబ్బంగి వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్న మీనా రిసార్ట్స్ ను నూతన శోభగులతో ముస్తాబు చేయడం జరిగిందన్నారు. పర్యాటక ప్రియులకు అన్ని విధాలుగా అనువైన ప్రదేశంలో ఉన్న ఈ రిసార్ట్స్ లో పర్యాటకులు బస చేయదానికే గాక ఈ ప్రాంతంలో నెలకొన్న శీతల వాతావరణం, మంచు తెరల శోయగాలను ఆస్వాదించేందుకు అన్ని విధాలా అనువైనదిగా మీనా రిసార్ట్స్ ను సకల సదుపాయాలతో అందుబాటు లోకి తీసుకు రావడం జరిగిందన్నారు. ఏడాది పొడుగునా అందుబాటులో ఉండే ఈ రిసార్ట్స్ సేవలను పర్యాటక ప్రియులంతా సద్వినియోగం చేసుకుని మన్య ప్రాంత అందాలను తిలకించి ముగ్ధులు కావాలని ఆమె కోరారు.

నేటి నుంచి ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ బండలు

- ఉచిత వంటగ్యాస్ పంపిణీతో ప్రతి కుటుంబానికి తగ్గనున్న ఆర్థిక భారం
- తెదేపా మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు పూర్ణచంద్రరావు, లక్ష్మణ్

విశాలాంధ్ర-చింతపల్లి : సార్వత్రిక ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఎన్డీయే కూటమి ప్రభుత్వం నేటి నుంచి ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తీసుకువచ్చిన ఏడాదికి మూడు ఉచిత వంటగ్యాస్ బండల పథకం గృహిణిలకు వరమని తెదేపా మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు కిల్లో పూర్ణచంద్రరావు, ఆంద్రాబు లక్ష్మణ్ అన్నారు. ఆ పార్టీ చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, ఇతర నాయకులతో కలిసి బుధవారం ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో వంట గ్యాస్ కలిగి ఉన్న ప్రతి ఒక్క లబ్దిదారుకు ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ బండలు అందించే కార్యక్రమం రాజకీయ పార్టీలకతీతంగా ప్రతి కుటుంబానికి పండగ అన్నారు. మునుపెన్నడు లేనివిధంగా ప్రతి కుటుంబానికి ఆర్థిక భారాన్ని తగ్గించి, గృహిణిలకు మేలు కలిగే విధంగా, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈపథకం వలన ప్రతి కుటుంబంలోనూ ఏడాదికి సుమారు 2500కు పైగా ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. ప్రజలపై పడే ఆర్థిక భారాన్ని కొంతవరకైనా తగ్గించాలనే సత్సంకల్పంతో తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందు చూపుతో సూపర్ సిక్స్ పథకాల ద్వారా మహిళలతో పాటు, అన్ని కుటుంబాలకు మేలు కలిగించే పథకాలకు రూపకల్పన చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగానే ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ బండలు అందించే కార్యక్రమాన్ని నేటి నుంచి అమలులోకి తీసుకురావడం శుభ పరిణామం అన్నారు. పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పడాల సత్తిబాబు, కిముడు అప్పారావు, బేతా నాగు తదితరులు పాల్గొన్నారు.

మూలన చేరిన మోటారు బోరు

- అత్యవసర పరిస్థితిలో సమకూరని అంబులెన్స్ సేవలు,
- కిల్లోగుడలో రోగుల అవస్థలు

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : నిధుల వినియోగంలో సంబంధిత ఆసుపత్రి నిర్వాహకుల నిర్లక్ష్యంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. మండలంలోని కిల్లోగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిత్యం రోగులు, అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంటుంది. 24గంటల ఆసుపత్రిని అన్ని హంగులతో అధికార తీర్చిదిద్దారు. గిరిజనులకు పూర్తిస్థాయిలో వైద్యం అందాలన్నదే సంలక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం చేసుకుంటున్న, క్షేత్రస్థాయిలో సమస్యలతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. పీహెచ్సీలో రోగుల సౌకర్యార్థం తాగునీటి సౌకర్యం కల్పించారు. మోటారు బోరు నాలుగు నెలలుగా పని చేయడం లేదు. నిత్యం రోగుల సందర్శిస్తుంటారు. వైద్య పరీక్షల అనంతరం మందు బిల్లలు వేసుకోవడంతో పాటు, గర్భిణీ స్త్రీలకు ప్రసవ సమయంలో గుటికేడు నీరు ధరిచేరని పరిస్తితి పీహెచ్సీలో నెలకొంది. మోటారు బోరు మూలన చేరడంతో తాగునీటి ట్యాంకు, అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. బోరు మరమ్మతుకు సంబంధిత ఆసుపత్రి నిర్వాహకులు చొరవ చూపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో వైద్యం అందుతున్నప్పటికీ అత్యవసర సమయంలో ఉన్నత వైద్యంకు తరలించడానికి అంబులెన్స్ సేవలకు సమకూర్చరని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. 24గంటల ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యం అందాల్సి ఉన్నప్పటికి అరకొర వైద్యంతో సరిపెట్టుకుని ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు అంటున్నారు. ఇప్పటికైన సంబంధిత జిల్లాస్థాయి ఉన్నత అధికారులు

స్పంధించి కిలోగూడ పీహెచ్సీలో రోగుల అవస్థలను పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లాం : పీహెచ్సీలలో మూలన చేరిన మోటారు బోరుతో బురద నీరు వస్తుందన్నారు. మరమ్మతు చేయించిన ఫలితం ఉండదని తెలిసి ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. సంబంధిత ఇంజినీరింగ్ అధికారిని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారి పీహెచ్సీలో సందర్శించారు. నూతన మోటారు ఏర్పాటుతో పాటు 2 వేల లీటర్ల సామర్థ్యాం కలిగిన వాటార్ ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనాలు తయారుచేసి పీవోకు ఇంజినీరింగ్ అధికారి సమర్పించారు. ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరైతే రోగులకు నీటి కష్టాలు తీరుతాయని పీహెచ్సీ వైద్యాధికారి నజీబుల్లా వివరణ ఇచ్చారు.

జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

జనసేన జిల్లా కార్యదర్శి సీతారాం, సీనియర్ నాయకుడు లక్ష్మణరావు

విశాలాంధ్ర-చింతపల్లి : జన సేన పార్టీ శ్రేణులు క్షేత్ర స్థాయి లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జనసేన జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం, ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఉగ్రంగి లక్ష్మణరావు అన్నారు. పెదబరడ పంచాయతీ మడిగుంట గ్రామంలో బుధవారం ఆ పార్టీ ముఖ్య నాయకులు, పాఠశాలల విద్యా కమిటీ చైర్మన్ లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా కమిటీ చైర్మన్ లను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో విద్యకు.ప్రధమ ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు.జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకువచ్చి బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్య అందించేందుకు కూటమి ప్రభుత్వంలో కంకణం కట్టుకున్నారన్నారు. విద్యా విధానాల్లో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న నూతన విధానాలను కొనసాగించేలా చూడాల్సిన బాధ్యత విద్యా కమిటీ చైర్మన్ లపై ఉందన్నారు. అదే క్రమంలో జన సైనికులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జనసేన అవలబిస్తున్న నూతన విధానాలను ప్రజలలోకి తీసుకొని వెళ్లి క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి జన సైనికులు కృషి చేయాలని, జనసేన బిజెపి టిడిపి మైత్రిలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు పారదర్శకంగా అందెందుకు కృషి చేస్తూనే స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేన పార్టీ అభివృద్ధికి జన సైనికులు కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటినుండే జన సైనికులు అంతా గ్రామాలకు వెళ్లి పార్టీ కార్యక్రమాలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు . స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులను గెలిపించుకొనే దిశగా జన సైనికులు అడుగులు వెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ లు శెట్టి మోహన్. సెగ్గే సింహాచలం, ఉల్లి అఖిల్, కొర్ర శ్రీకాంత్, బోనంగి సత్తిబాబు,. వంతల రాంబాబు, నాగు, చిన్న, గామ్ బుజ్జి, ఉల్లి ప్రశాంత్, గోపినాయక భాస్కరరావు, వర్మ (వందు) అబ్బాయి దొర, అధిక సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు.

లంచం అడగడంలో ఈ సెక్రటరీ స్టైలే వేరు

విశాలాంధ్ర-కూనవరం : మామూలుగా ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయాలంటే నేరుగానో మధ్యవర్తి ద్వారానో లంచం అడిగే అధికారులను చూశాం. కానీ కూనవరం సెక్రటరీ మాత్రం ఆ పాత పద్ధతికి విరుద్ధం. చట్ట ప్రకారం తాను చేయాల్సిన పనిని కూడా రోజుల తరబడి వాయిదా వేస్తూ, చివరికి ఆ పని అవడం కష్టమని నమ్మించి, భయపెట్టి, ఎంతో కొంత ఇస్తాం తీసుకొని పనిచేసిపెట్టండి బాబు అని లబ్ధిదారులే అడిగే పరిస్థితులను సృష్టిస్తాడు. ఆ తర్వాత చేయి తడిపితే గాని సంతకం పెట్టడు. టేకులబోరు గ్రామానికి చెందిన నాగమణి అనే మహిళ కూతురు రమ్య వయసు ఆధార్ కార్డులో 26-5-2010 గా తప్పుగా ఉంది. కానీ ఇంటర్మీడియట్ చదువుతున్న రమ్య అసలు వయసు ఎస్ ఎస్ సి మెమో ప్రకారం 26-5-2008. ఆధార్‌లో పుట్టిన తేదీ మార్పు కోసం సచివాలయంలో దరఖాస్తు చేస్తే పంచాయతీ సెక్రటరీ మళ్లీ ఆధార్లో ఉన్న తేదీ ప్రకారమే జనన ధ్రువ పత్రం ఇచ్చాడు. అయ్యా మళ్లీ పొరపాటు జరిగింది. మాకు కావాల్సింది ఎస్ ఎస్ సి మెమో ప్రకారం అందులో ఉన్న డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్ కావాలి అని అడిగితే అది కుదరదు, కావాలంటే ఎస్ఎస్సి మెమోలో ఉన్న డేటే మార్చుకోండి అని చెప్పడంతో ఆ మహిళకు ఏం చేయాలో పాలుపోలేదు. సచివాలయంలో జరిగిన పొరపాటు ను తామే సరిచేయాల్సింది పోయి 15 రోజులుగా ఆఫీస్ చుట్టూ తిప్పించుకుంటున్న సెక్రటరీ పై చర్యలు తీసుకోవాలి.లంచం ఇస్తే తప్ప పని చెయ్యనని చెప్పకనే చెప్పిన సెక్రటరీ పద్ధతి మారాలని ప్రజల కోరుతున్నారు.

తాన్న సీతారాంపురంలో పొలం పిలుస్తుంది

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని గుచ్చిమి రైతుసేవా కేంద్రం పరిధిలోని తాన్న సీతారాంపురం గ్రామం పంటపొలములలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి ఎస్ అవినాష్ ఆధ్వర్యంలో జరిగినది. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త శ్రీనివాస్ రాజు పాల్గొని పలు అంశాలను వివరించారు. రైతులకు ఉండే సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

రూపాబాయ్ సేవలు అభినందనీయం: డిప్యూటీ డిఈఓ

విశాలాంధ్ర-జియ్యమ్మవలస: ఉపాధ్యాయ వృత్తి ద్వారా ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన రూపాబాయ్ సేవలు అభినందనీయమని జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి పి.కృష్ణమూర్తి అన్నారు బుధవారం పెదబుద్దిడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన పువ్వల రూపాభాయ్ సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నేడు అన్నివృత్తులలో ఎంతో కీలకమైనదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సీమల సుజాత, ఎంపీటీసీ రేవళ్ల జ్యోతిశ్రీ ప్రధానోపాధ్యాయులు పి.ప్రసాద్, తోటి సిబ్బంది జి. స్వామినాయుడు, కోట కృష్ణచంద్ర, బి.సత్యనాయుడు, ఏ.కృష్ణారావు, ఎం. శ్రీనివాసకుమార్, జి.విజయ, వి.జనార్ధనరావు, సిహెచ్ తులసి, స్కూల్ కమిటీ చైర్మన్ నారం నాయుడు, గురాన శ్రీరామమూర్తినాయుడు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సులభ పద్ధతిలో విద్యను బోధించాలి

విశాలాంధ్ర-మారేడుమిల్లి : విద్య ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా టెక్నికల్ ఎట్ రైట్ లెవెల్ (టిఎఆర్ఎల్) కార్యక్రమంలో భాగంగా ఈనెల 28వ తేదీ నుండి 30వ తేదీ వరకు మారేడుమిల్లి ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించామని ఎంఈఓ కె తాతబ్బాయిదొర బుధవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మూడవ తరగతి నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు తెలుగు రాయడం చదవడం రానటువంటి వారికి గణితంలో అంకెలు సంఖ్యలను సతుర్విధ ప్రక్రియ చేయలేకపోతున్న విద్యార్థులకు సులభంగా బోధించుటకు ఈ ట్రైనింగ్ ఎంతగానో దోహద పడుతుందని ఎంఈఓ అభిప్రాయపడ్డారు. మండల స్థాయిలో ఉన్నటువంటి అన్ని విద్యాసంస్థల ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ పి లు లండ వెంకటేశ్వర్లు, ఎస్ దేవ ప్రకాష్, ఎం జగజీవన్, సీఆర్పీలు డి కమలాకర్, బి మధు పాల్గొన్నారు.

పల్లె పండుగ కార్యక్రమాలను ఎంపీడీఓ పరిశీలన

విశాలాంధ్ర-సీతానగరం : మండల కేంద్రంలోని పెదభోగీల పంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న నిర్మాణాలను ఎంపీడీవో పాండ్రంకి త్రివిక్రమరావు బుధవారం నాడు పరిశీలించారు. దీంతోపాటు గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న ఇంకుడు గోతులను కూడా పరిశీలించారు. గ్రామంలో గృహ నిర్మాణ పథకాన్ని కూడా పరిశీలించారు. అన్ని గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాల్లో భాగముగా వాళ్ళ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇదిలా ఉండగా నవంబర్ 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసామన్నారు. నేడు గురువారం దీపావళి పండుగ సందర్భంగా బ్యాంకులకు సెలవు దినంకావడంతో బుధవారంనాడే బ్యాంకుల నుండి పెన్షన్లకు సంబంధించి చెల్లించాల్సిన డబ్బులను సచివాలయ సిబ్బంది విత్ డ్రా చేసారని, వారివద్ద భద్రపరిచారని, శుక్రవారం నాడు తెల్లవారుజామున పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేయడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి మండల స్థాయి అధికారులను పర్యవేక్షణ అధికారులుగా కూడా నియమించడం జరిగిందన్నారు.

పీఎంఈజిపిని సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి ఉపాధికల్పన కార్యక్రమాన్ని (పీఎంఈజిపి) సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పీఎంఈజిపి పథకం కింద మంజూరైన మారుతీ స్విఫ్ట్ డిజైర్ కారును లబ్దిదారుడుకు కలెక్టర్ తాళాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల్లో ఇది చాలా మంచి కార్యక్రమమని, నిరుద్యోగులైన యువత దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరుద్యోగులు సొంత వ్యాపారాలను నిర్వహించుకునేందుకు ఇదొక సదవకాశమని అన్నారు. 18 ఏళ్లు నిండి 8వ తరగతి విద్యార్హత కలిగిన ప్రతీ ఒక్కరూ అన్ని సామాజిక, వ్యాపార రంగాల్లో పీఎంఈజిపి పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని పేర్కొన్నారు. 30 శాతానికి పైగా కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఎం.ఆర్.టూర్స్ అండ్ ట్రావెల్స్ పేరిట లబ్దిదారుడు మీసాల రాహుల్ పొందిన కారు ఖరీదు రూ.9,11,488/-లు కాగా, లబ్దిదారుడు రూ.51,488/-లు మాత్రమే భరించాల్సి ఉంటుందన్నారు. ఇందులో రూ.3,19,021/-లు కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ ఉంటుందని, మిగిలిన పైకాన్ని బ్యాంకు రుణంగా మంజూరు చేసిందని అన్నారు. రుణాన్ని ఏడేళ్ల వరకు చెల్లింపులు చేసుకునే సౌలభ్యం ఉందన్నారు. పీఎంఈజిపి పథకంతో లబ్దిదారుడు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు, వైసిపి శ్రేణులకు దీపావళి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-బలిజిపేట : దీపావళి అనేది చీకట్లను తొలగించి వెలుగును అందించే పండుగని, ఇది మన జీవితాల్లో సరికొత్త వెలుగులను నింపుతుందని, నియోజకవర్గ ప్రజలకు, వైసీపీ శ్రేణులకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. దీపావళి పండుగ మీ జీవితంలో ఆశ, ఆనందం మరియు అభ్యుదయాన్ని నింపి, ప్రతి రోజు మరింత ప్రత్యేకంగా మారాలని తెలిపారు.

కొవ్వొత్తుల ర్యాలీను నిర్వహించిన పోలీసులు

పాల్గొన్న జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి

విశాలాంధ్ర-పార్వతీపురం : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆధ్వర్యంలోబుధవారమురాత్రి జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పార్వతీపురం పట్టణంలో కలెక్టర్ ఆఫీస్ నుంచి ఆర్టిసి కాంప్లెక్స్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ కార్యక్రమంను నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరులు చేసిన ప్రాణ త్యాగాలను స్మరించుకుంటూ ఈకొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు.అమర వీరులు చేసిన త్యాగాల ఫలితం గానే మనం ఈరోజు ఇంత ప్రశాంతంగా జీవనం సాగించడం జరుగుతుందని తెలిపారు. ఆర్టీసీకూడలి వద్ద విధినిర్వహణలో తమప్రాణాలను సైతం లెక్కచేయకుండా అశువులు బాసిన త్యాగమూర్తుల చిత్రపటాలు వద్ద కోవ్వొత్తులను ఉంచి శ్రద్ధాంజలి ఘటించి,జోహార్లు పలికారు.ఈకార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు జిల్లా అదనపు ఎస్పి డాక్టర్ దిలీప్ కిరణ్,జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ ఎస్.వి.వెంకట అప్పారావు, పార్వతీపురం టౌన్ ఇన్స్పెక్టర్ నారాయణరావుగారు, పార్వతీపురం రూరల్ ఇన్స్పెక్టర్ గోవిందరావు,జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ శ్రీరాములు,నాయుడు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, కళాశాల విద్యార్థిని విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా చెక్కులు అందజేత

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని రేఖపల్లి గ్రామానికి చెందిన ఎస్. కె.ఇబ్రహీం (వార్త, విలేఖరి), రాజుపేట గ్రామానికి చెందిన వడ్డాణపు సత్యనారాయణ లకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అందజేశారు. బాధితులు ఇబ్రహీం కు ఇటీవల వెన్నుముఖకు శస్త్ర చికిత్స జరగగా, సత్యనారాయణ కు శస్త్ర చికిత్స ద్వారా కిడ్నీలో రాయిని తొలగించారు. దీంతో వీరిద్దరు సిఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకున్నారు. ఇబ్రహీం కు రూ.87,056 వేలు, సత్యనారాయణకు రూ.56,273 వేలు మంజూరయ్యాయి. బుధవారం రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవి తన క్యాంపు కార్యాలయంలో బాధితులు ఇద్దరికి చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యాదర్శి బొర్రా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా దీపావళి సమగ్రి విక్రయాలు

విశాలాంధ్ర-దుంబ్రిగుడ: దీపావళి పండుగను పురస్కరించుకొని మండలంలోని అరకు సంత బయలులోని సంత షెడ్లులో దుకాణాలు ఏర్పాటుచేసి బుధవారం బాణసంచా విక్రయాలు జోరుగా చేపట్టారు. పండగను ఘనంగా జరుపుకోవడానికి మండలంలోని పలు గ్రామాల నుంచి గిరిజనులు బాణ సంచాల సామగ్రీలను కొనుగోలు చేసేందుకు తరలివచ్చారు. గతంలో అరకులోయ మండల కేంద్రంలోని బాణ సంచాల విక్రయాలను చేసేవారు. ఈ ఏడాది స్థానిక మండలంలోని అరకు సంతబయలు ఏర్పాటు చేయడంతో మండల వాసులకు బాణ సంచాల సామగ్రీలను కొనుగోలు చేసుకునేందుకు అనుకూలంగా ఉన్నట్లు స్థానికులు అంటున్నారు.

బిజెపి జిల్లా పార్టీ కమిటీ సమావేశం

విశాలాంధ్ర-దుంబ్రిగూడ: భారతీయ జనతా పార్టీ జిల్లా కమిటీ సమావేశం అల్లూరి జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు పి.రాజారావు ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బిజెపి పార్టీ సీనియర్ నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. గంగయ్య పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు మండల నాయకులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. ఇటీవల కాలం నుండి పార్టీ సభ్యతాల ప్రక్రియ పూర్తి దశలో చేయడానికి శ్రమించిన క్షేత్రస్థాయి కార్యకర్తలకు మండల స్థాయి నాయకులకు ఆయన అభినందించారు. అదేవిధంగా అధిష్టానం జిల్లాస్థాయి నుండి బూతు కమిటీల వరకు నియామక ఎన్నిక ప్రక్రియ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుష. ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మతం పంచాయతీ సర్పంచ్ శాంత కుమారి, కిషన్ మోర్చా జిల్లా అధ్యక్షులు, సాగర పంచాయతీ ఎంపీటీసీ దేవదాసు, ట్రైకర్ మెంబర్ కూడా కృష్ణారావు, కితలంగి పంచాయతీ బూత్ ఇన్చార్జి కోర్ర.గాసి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ పాఠశాలలో సోషల్ టీచర్‌ను భర్తీ చేయండి

విశాలాంధ్ర-పార్వతీపురం : పార్వతీపురం ఐటీడిఏ పరిధిలోని సీతానగరం మండలం జోగింపేటలో నిర్వహిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక సంస్థ ప్రతిభ పాఠశాలలో గత రెండుసంవత్సరాలుగా సాంఘిక శాస్త్రం (సోషల్ టీచర్) లేక విద్యార్థులు ఆ పాఠ్యాంశంలో వెనుకబడిపోతున్నారని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ తెలిపారు. బుధవారం పాఠశాలను సందర్శించిన సమయంలో ప్రిన్సిపాల్ ధర్మరాజును కలవగా గిరిజన సంక్షేమ గురుకులం సొసైటీ అధికారులకు ఈసమస్య చెప్పామని ప్రిన్సిపాల్ తెలిపారని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే సోషల్ టీచర్ ను నియమించాలని ఆయన డిమాండ్ చేసారు.

రెవెన్యూ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

భూసమస్యల పరిష్కారంపై కడశిల్పలో రెవెన్యూ గ్రామసభలో వైస్ ఎంపీపీ

విశాలాంధ్ర-చింతపల్లి : భూసమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ గోపి నాయక శారద అన్నారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీ కడశిల్ప గ్రామంలో ఆ పంచాయతీ వీఆర్వో నాగమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూశాఖ నిర్వహించే ఈ గ్రామసభలో భూముల రీసర్వేలో పొరపాట్లను సరిదిద్దుకునేందుకు గ్రామసభలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం రెవెన్యూ ఉద్యోగులు భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకుడు వనగల బెన్నిబాబు. వైస్ సర్పంచ్ పాంగి మోహన్ రావ్, వీఆర్ఏ నారాయణ, సర్వేయర్ సావిత్రి, గ్రామ పెద్దలు గోపినాయక రంగారావు, పల్టాసింగి సన్యాసిరావు, పాంగి డోంబు, బోడ్నాయక్ రాందాస్. పాంగి పొట్టి నర్సు, పాంగి సత్తిబాబు. గ్రామ రైతులు పాల్గొన్నారు.

వెంగళరాయసాగర్‌లో 3 లక్షల ఫింగర్లింగ్ చేప పిల్లలు విడుదల

విశాలాంధ్ర- సాలూరు : వెంగళరాయ సాగర్ జలాశయం లో బుధవారం మత్స్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో 3 లక్షల ఫింగర్లింగ్ 80 మి.మీ చేప పిల్లలను రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పోత్సహకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని మత్స్యకారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల కోసం అనేక పథకాలను రాయితీతో అందిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వంలో మత్స్యకారులకు ఉజ్వల భవిష్యత్ ఉందని చెప్పారు. మత్స్యశాఖ డిడి నిర్మలకుమారి, పార్వతీపురం మన్యం జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్యలు మాట్లాడుతూ అన్నంరాజువలస, సమీపంలో ఉన్న 8 గిరిజన గ్రామాలకు చెందిన 413 మత్స్యకార కుటుంబాలు చేపల వేటను ఆధారంగా చేసుకొని జీవిస్తున్నారన్నారు. వారి జీవనాధారం మెరుగుపరుచుకునేందుకు వీలుగా ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం ద్వారా 40% శాతం లబ్ధిదారుల వాటాతో మూడు లక్షల చేప పిల్లలను ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. విజయనగరం జిల్లాలో ప్రభుత్వ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం నుండి తీసుక వచ్చిన చేప పిల్లలను సాగర్ లో విడుదల చేశామన్నారు.ఈ చేప పిల్లలు వాటికి లభించిన ఆహారపదార్థాలను బట్టి 8-9 మాసాలలో కేజీ,కేజీన్నర వరకు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు సాలూరు, మక్కువ మండలాల తెదేపా అధ్యక్షులు ఆముదాల పరమేష్, గుల్ల వేణుగోపాల్, సాలూరు మత్సశాఖ అభివృద్ధి అధికారి శ్రీదేవి,జిల్లా సహకార సంఘం అధ్యక్షుడు చిన్నప్పన్న, చినచీపురువలస మత్స సహకార సంఘం అధ్యక్షుడు సురపాటి ఆదినారాయణ, మత్స్యశాఖ సహాయకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జనసేన నాయకులకు అభినందనలు తెలిపిన కాకరపాడు గ్రామ ప్రజలు

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్త వీధి మండలం రీంతాడ పంచాయతీ పరిధి కాకరపాడు గ్రామస్తులు, గత వారం పిలుపుమేరకు, జనసేన పార్టీ నాయకులు గ్రామంలో పర్యటించి, సమస్యలను అడిగి తెలుసుకొని మంచినీటి సమస్య ఉందని గ్రామస్తులు చెప్పగా అధికారుల దృష్టికి వెంటనే తీసుకువెళ్లి మరమ్మతులు గురైన మోటార్ ను బదులు కొత్త మోటర్ ను ఏర్పాటు చేయడంతో గ్రామంలో మంచినీటి సమస్య తీరిందని గ్రామస్తులు తెలిపారు. గతంలో వైసిపి ప్రజా ప్రతినిధులకు ఎన్నో మార్లు చెప్పినప్పటికీ, మంచినీటి సమస్య పరిష్కరించలేదని, నీటి సమస్య వలన గ్రామస్తులము చాలా ఇబ్బంది పడ్డామన్నారు. మండల జనసేన పార్టీ నాయకులు కు కాకరపాడు గ్రామంలో పర్యటించి మంచినీటి సమస్య అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించినందుకు జనసేన పార్టీ అరకు పాడేరు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్ , జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కోయం బాలరాజు, బూతు కన్వీనర్ గొడుతూరి పరమేశ్వరరావు, కొయ్యం ఇమ్మాను యేల్, కొయ్యంసిద్దు, కు గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

స్కిల్ సెన్సస్ సర్వే గణనపై శిక్షణ

విశాలాంధ్ర-అనంతగిరి : రాష్ట్రవ్యాప్తంగా జరగబోవు స్కిల్ సెన్సెస్ సర్వే నైపుణ్య గణన పై ఒకరోజు శిక్షణ నిర్వహించినట్లు అనంతగిరి ఎంపీడీవో ఏవివి కుమార్ తెలిపారు మండలంలో ఉన్న సచివాలయ సిబ్బంది కి ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమం అయిన ఈ స్కిల్ సెన్సెస్ సర్వే ఏ విధంగా నిర్వహించాలి అనే విషయంపై అవగాహన పెంచామని తెలిపారు ప్రతి ఒక్క సచివాలయ సిబ్బంది శిక్షణ కార్యక్రమం కొరకు మండలంలో ఇంటింటికి వెళ్లి 15 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల లోపు వయస్సు గల వారందరికీ నమోదు చేయాలని సూచించామన్నారు అదేవిధంగా ఆన్లైన్లో నమోదు చేసి వారి యొక్క అభిప్రాయం మేరకు నైపుణ్య శిక్షణ ఇస్తామని తెలిపారు అనంతరం వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ స్కిల్ సెన్సెస్ యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు సోమవారం నుండి నెలరోజుల పాటు సచివాలయ సిబ్బంది మండలంలో ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయనున్నారని తెలిపారు. మండలంలో యువతీ యువకులు అందరూ వీరికి సహకరించి వివరాల అందించాలని ఎంపీడీవో తెలిపారు ఈ శిక్షణ తరగతులకు డిఓటిలుగా అనంతగిరి ఎన్ ఆర్ పురం కార్యదర్శులు దేవా గురునాథం వ్యవహరించారని తెలిపారు ఈ కార్యక్రమం నిరుద్యోగ యువతీ యువకులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరూ వారి అభిప్రాయం తెలిపి నమోదు చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

గవర్నమెంట్ కాలేజి విద్యార్థులు 200 మంది ర్యాలీగా వెళ్ళి ఎమ్మార్వోకు వినతి

విశాలాంధ్ర-మక్కువ : మండల కేంద్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ నుండి ఎంఆర్ఓ ఆఫీస్ వరకు సుమారుగా 200 మంది విద్యార్థులు ర్యాలీగా వెళ్లి ఎమ్మార్వోకు వినతి సమర్పించారు. ఈసందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి డి.పండు మాట్లాడుతూ ఈనెల అక్టోబర్ 27 నుంచి 30 వరకు మండలాల్లో ధర్నాలు, నవంబర్ 2 నుంచి 4 తేదీ వరకు కలెక్టరేట్ వద్ద దీక్షలు నవంబర్ 6న చలో కలెక్టరేట్ పిలుపునివ్వడం జరిగింది. అలాగే విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని ఏదైతే పెండింగ్‌లో ఉన్న 3,480 కోట్లు విద్యాదీవెన వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలి. అలాగే డిగ్రీలో మేజర్ మైనర్ ఆన్సర్ విధానాన్ని రద్దు చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలుచేయాలి, పార్వతీపురం మన్యం జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్స్, యానం పోస్టులను భర్తీ చేయాలని ఖాళీగా ఉన్న సంక్షేమ హాస్టల్లో వార్డెన్లను మరియు వర్కర్లను వెంటనే నియమించాలి, ధరలకు అనుగుణంగా మిస్ చార్జీలు 3000 కి పెంచాలి. బకాయిలను వెంటనే విడుదల చేయాలి అలాగే తల్లికి వందనం, పూర్తి ఫీజు రీయంబర్స్మెంట్ అమలుపై స్పష్టత ఇవ్వాలి ఎస్సీ, బీసీ,పోస్టుమెట్రిక్ హాస్టల్లకు సొంత భవనాలు, గిరిజన పోస్ట్ మెట్రిక్ హాస్టల్లో అదనపు భవనాల నిర్మించాలని ఈ ధర్నాలో విద్యార్థులందరూ పాల్గొని జయప్రదం చేయాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జి. సింహాద్రి జి. సంజీవ్, రంజిత్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంబర పోలమాంబ ఆలయంలో శ్రీమహాలక్ష్మి ధనలక్ష్మి కుంకుమ పూజ

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలం శంబర గ్రామంలో వేంచేసి ఉన్న ప్రముఖ ఇలవేల్పు ఉత్తరాంధ్ర గిరిజన ఆరాధ్య దేవత కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పోలమాంబ అమ్మవారి చదురుగుడి ఆలయంలో తే 30-10-2024 బుధవారం సాయంత్రం 6.30 గంటలకు ఆశ్వీయుజ ధన త్రయోదశి పర్వదినం సందర్భంగా సకల జనుల అష్టైశ్వర్యములు అభివృద్ధ్యార్థం లోకకళ్యాణార్థం, శ్రీ మహాలక్ష్మి ధన ధాన్య, ధనలక్ష్మి కుంకుమ పూజను అత్యంత వైభవంగా శాస్త్రోక్తం అర్చకులు శ్రీ కప్పగంతుల శ్రీనివాస శర్మ నిర్వహించిరి. ఈ కార్యక్రమంలో భక్తులు, స్త్రీలు అత్యధికంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి వి.వి. సూర్యనారాయణ, శ్రీ తీల్ల పోలినాయుడు, అల్లు వెంకటరమణ, అక్యాన తిరుపతి నాయుడు, ఆక్యాన నరసింగ రావు, గంజి కాశి నాయుడు, నైదాన తిరుపతి రావు, తీళ్ళ సింహాచలం, గొట్టాపు కృష్ణ, మద్ది రాము, పుర్రు నారాయణ, ఆలయ ఆశాధిలు, హాజరైతిరి. పూజ అనంతరం భక్తులకు పసుపు, కుంకుమ, ధనలక్ష్మి పూజ చేసిన కొత్త నాణెము , ప్రసాదము వితరణ జరిగినది. భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీ వివి సూర్యనారాయణ గారు తగు ఏర్పాటు చేసిరి.